# ప్రవాసాంధ్రులు ప్రభుత్వంతో చేతులు కలపండి

## మంత్రి రామనారాయణరెడ్డి పిలుపు

## అటా వేడుకల ముగింపు

## న్యూస్‌టుడే, నెల్లూరు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులో తొలిసారి వినూత్నంగా నిర్వహించిన అమెరికా తెలుగు సంఘం(అటా) వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ ఎం.రవిచంద్ర ప్రవాసాంధ్రుల కోసం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం వారినుద్దేశించి మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోందని, ఈ కారణంగానే 2006-07 లో ఒక్క పర్యాటక రంగంలోనే రూ.1,500 కోట్ల పనులు ప్రారంభమయ్యాయన్నారు. మిగిలిన రంగాల్లోనే గణనీయంగా పెట్టుబడులు పెరిగినట్లు చెప్పారు. ఉన్నతస్థానాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు విరివిగా పెట్టుబడులతో వస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి పథాన పయనించే అవకాశం ఉంటుందన్నారు. అటా ప్రస్తుత అధ్యక్షుడు గవ్వా చంద్రారెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవడంతోపాటు మాతృభూమికి సేవ చేయాలన్న తపనతో ఏర్పడినదే 'అటా'గా అభివర్ణించారు. వ్యక్తిగా కంటే సమష్టిగా ఎక్కువ సేవ చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అలా ముందుకొచ్చే వారికి తమ సంఘం ఓ వేదికగా మాత్రమే నిలుస్తుందని తెలిపారు. 2008 జులైలో అమెరికాలోని న్యూజెర్సీలో నిర్వహించే అటా పదో వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. వాటిని 'తెలుగుతల్లికి హారం..దశమావతారం' అన్న నినాదంతో జరుపుతామని వివరించారు. పలువురు ప్రవాసాంధ్రులు తమ అనుభూతులను ఆహుతులతో పంచుకున్నారు.

*విరివిగా విరాళాలు..*

నెల్లూరుకు చెందిన పలువురు ప్రవాసాంధ్రులు చదువుకున్న పాఠశాలలకు, సొంత గ్రామాల అభివృద్ధికి విరివిగా విరాళాలు అందజేశారు. ప్రతి ఏటా జిల్లా అభివృద్ధికి రూ.10 కోట్లు తమ సంఘం తరపున అందజేస్తామని వారు హామీ ఇచ్చారు.

*సన్నారెడ్డి రెడ్డి రూ.1.35 కోట్ల విరాళం*

మెగాసాఫ్ట్ అధినేత సన్నారెడ్డి రవిరెడ్డి నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట మండలం అర్వపాలెంలో తాను చదువుకున్న పాఠశాలలు, కళాశాల అభివృద్ధికి

రూ.35 లక్షలు, నెల్లూరులో నిర్మించే మినీ ఆడిటోరియానికి రూ.కోటి విరాళంగా అందజేశారు.

## దొడ్డమనసు

### రుణం తీర్చుకున్న ప్రవాసాంధ్రులు

### అలరించి ముగిసిన అటా వేడుకలు

న్యూస్‌టుడే, నెల్లూరు సిటీ



చెక్కును మంత్రికి అందజేస్తున్న సన్నారెడ్డి రవిరెడ్డి దంపతులు

ఎన్నో కష్టనష్టాలకోర్చి అసౌకర్యాల నడుమ ఉన్నత చదువులు చదువుకున్నారు. అవకాశాలను వెదుక్కుంటూ ఖండాంతరాలను దాటి వెళ్లారు. అక్కడ రేయనక, పగలనక శ్రమించి ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారు. గతాన్ని మరవక, తాము పడ్డ అవస్థలు ముందుతరాలు పడకుండా ఉండాలన్న సహృదయంతో స్పందించారు. తాము చదువుకున్న పాఠశాలల, గ్రామాల అభివృద్ధికి లక్షలాది రూపాయలను విరాళాలుగా ప్రకటించారు. వారే ప్రవాసాంధ్రులు. నెల్లూరులో శని, ఆదివారాల్లో ముగిసిన 'అటా' వేడుకల్లో పాల్గొన్న వీరు తమ పెద్దమనసుతో సింహపురీయుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయారు.



వెంకటరత్నాన్ని సన్మానిస్తున్న మంత్రి ఆనం..

నెల్లూరులో రెండురోజుల పాటు వినూత్నంగా సాగిన అమెరికా తెలుగు సంఘం (అటా) ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉదయం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ రవి చంద్ర ప్రవాసాంధ్రులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధనరెడ్డి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కెనడాలో స్టాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడిన పోలవరపు వెంకట సుబ్బా నాయుడు తాను చదువుకున్న ఏఎస్‌పేట మండలం సి.బి.వరం పాఠశాలకు రూ.4 లక్షలు విరాళంగా ప్రకటించి చెక్కును మంత్రి చేతుల మీదుగా కలెక్టర్‌కు అందజేశారు. రాత్రి పురమందిరంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పలువురు ప్రవాసాంధ్రులు ప్రసంగించి భారీగా విరాళాలు ప్రకటించారు. 'అటా' కార్యదర్శి డాక్టర్ హరనాథ్ క్యాన్సర్ ఆస్పత్రి అభివృద్ధికి రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఏటా జిల్లా అభివృద్ధికి రూ.10 కోట్లు ఇస్తామని వెల్లడించారు.



అమెరికా - భారత్ పుస్తకాన్ని
కలెక్టర్‌కు అందజేస్తున్న ప్రవాసాంధ్రులు



మంత్రికి చెక్కు ఇస్తున్న వెంకటరత్నం కుమార
వెంకట సుబ్బానాయుడు దంపతులు

*ఆరోగ్యం , విద్యకు అధిక ప్రాధాన్యం*

అటా అధ్యక్షుడు గవ్వా చంద్రారెడ్డి మాట్లాడుతూ 'గ్రామాన్ని సాకు కోండి.. జన్మభూమి రుణం తీర్చుకోండి' నినాదంతో చేపట్టనున్న గ్రామాభివృద్ధిలో ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ చేపట్టిన ప్రజ్వలిక మహత్తర కార్యక్రమమని, దీనికి అటా తరపున రూ.10 వేల డాలర్లు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో ప్రతిభ కనబర్చిన పది మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తామన్నారు. ఈ వేడుకల సంధానకర్త సన్నారెడ్డి రవిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరీయులు ఇచ్చిన ఆతిథ్యానికి పులకించిన ప్రవాసాంధ్రులు జిల్లాపై విరాళాల జల్లు కురిపించారన్నారు. ప్రవాసాంధ్రుడు దోనిపర్తి వెంకయ్య మాట్లాడుతూ 'తాను 40 ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డానని, అప్పుడు కేవలం 25 కుటుంబాలు అమెరికాలో ఉండేవన్నారు. వారందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి సేవాకార్యక్రమాలు జరిపినట్లు చెప్పారు. అందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలో రూ.3.5 కోట్ల వ్యయంతో డిగ్రీ, బీఈడీ, ఇంజినీరింగ్ కళాశాలలను లాభాపేక్ష లేకుండా నిర్మించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

*వచ్చే ఏడాది పినాకినీ ఉత్సవాలు: ఆనం*

వచ్చే ఏడాది జిల్లాలో పినాకినీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి రామనారాయణరెడ్డి ప్రకటించారు. వచ్చే ఏడాదిలో నెల్లూరు కలెక్టరేట్ ఏర్పడి 200 ఏళ్లు పూర్తవుతుందని, పినాకినీ ఉత్సవాలతో కలిపి వీటిని జరుపుతామన్నారు. ప్రవాసాంధ్రులు పెద్దమనసుతో స్పందించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పదివేల మంది వృద్ధకళాకారుల పింఛను దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యూజెర్సీలో జరిగే అటా వేడుకలకు నెల్లూరు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యాన ఓ బృందాన్ని పంపుతామని తెలిపారు. కలెక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ ఈ

వేడుకల ద్వారా తమ ఉద్దేశం నెరవేరిందన్నారు. ప్రాచీన కళలను ప్రోత్సహించాలన్న తమ లక్ష్యం రెండురోజులపాటు ఇక్కడ సుమారు 200 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వడం, అలాంటి కార్యక్ర మాలకు ఓ ఆడిటోరియం నిర్మాణానికి ప్రవాసాంధ్రులు ముందుకు రావడం ద్వారా నెరవేరిందని చెప్పారు. ఎస్పీ మల్లారెడ్డి మాట్లాడుతూ విదేశాలకు పిల్లలను పంపిన తల్లిదండ్రులు తమకు ఏం చేస్తు న్నారని ఆశించకుండా తమ రికి ఏం చేస్తున్నారో ఆలోచించాలని కోరారు. విద్యుత్తు సౌకర్యం లేని మారుమూల గ్రామమైన తన సొంతరి నుంచి అయిదుగురు విదేశాల్లో స్థిరపడ్డారని చెప్పారు. జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ దానం అనేది రక్తంలోనే ఉండాలంటూ తమ దాతృత్వాన్ని చాటిన ప్రవాసాంధ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ఎమ్మెల్సీలు బూదాటి రాధయ్య, దాచూరి రామిరెడ్డి, పలువురు ప్రవాసాంధ్రులు మాట్లాడారు.

## నయనానందం

### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు




నెల్లూరు, డిసెంబరు 23 (న్యూస్‌టుడే): నిత్యం ఒత్తిళ్లతో సతమతమయ్యే సింహపురి వాసులకు నయనా నందం చేసేలా సాగిన 'ఆటా' సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆటా కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజైన ఆదివారం పురమందిరం, వి.ఆర్. కళాశాల మైదానాల్లో జరిగిన జానపద, సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు, పౌరాణిక నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.




ఉదయం నుంచే..

పురమందిరం, వి.ఆర్. క్రీడా మైదానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగి వివిధ జానపద, సంప్రదాయ ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో నగరవాసులు ఈ కార్యక్ర మాలను పెద్ద ఎత్తున తిలకించారు. జడకోలాటం, పగటి వేషాలు, బుట్టబొమ్మలు, వీధి భాగవతం, గరిడి, ఒగ్గుడోళ్లు, వీరనాట్యం, గరుడాచలం, యానాది మేళం తదితర 20 జానపద నృత్యాలు, పౌరాణిక నాటకాలతో వి.ఆర్. కళాశాల మైదానంలో జరిగిన ప్రదర్శనలు ప్రజలను కట్టిపడేశాయి.




తెల్లవారనీకోయి.. ఈ రేయిని

నెల్లూరు : లాహిరి.. లాహిరి.. లాహిరిలో... నీవు లేక వీణ పలుకలేనన్నది.. తెలవారనీకోయి.. ఈ రేయిని అంటూ ఆలపించిన అలనాటి ఘంటసాల గీతాలు నగర ప్రజలను వీనులవిందు చేశాయి. ఆటా

వేడుకల్లో భాగంగా వి.ఆర్. కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి చల్లటి వేళ సాగిన ఈ కార్య క్రమంలో వినసొంపైన మధుర గీతాలతో వింటూ నగర ప్రజలు తన్మయంలో మునిగిపోయారు. ఘంట సాల సంగీత సభ అధ్యక్షుడు ఆదిశేషు, కళాకారులు జెర్సీ, వరదాచారి, నాదప్రియ, యాంకర్ కె.వి.ఎన్. ప్రసాద్‌లు నగర ప్రజల మన్ననలు పొందారు. ఆటా వేడుకల్లో భాగంగా పురమందిరం, వి.ఆర్.కళా శాల మైదానాల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో తమ చాకచక్యాన్ని చాటిన వాకాటి విజయకుమార్‌రెడ్డి, సి.హెచ్. శ్రీనివాసులు, తుంగా శ్రీనివాసులు, వి. శ్రీనివాసులురెడ్డి కళాంజలి అనంత్, బి.వి. నరసింహం, బెనర్జీలను పలువురు ప్రశంసించారు.

## మనదే బంగారు భవిత

### చిన్నారులకు ప్రవాసాంధ్రుల హామీ

### ఆసక్తిగా ముఖాముఖి

న్యూస్‌టుడే, నెల్లూరు


ప్రశ్నలడుగుతున్న వి.బి.ఆర్. పాఠశాల విద్యార్థులు

భారత రాయబార కార్యాలయాల ముందు విదేశీయులు క్యూకట్టే రోజు ఎంతో దూరంలో లేదని ప్రవా సాంధ్రులు అభిప్రాయపడ్డారు. నెల్లూరులో రెండు రోజులపాటు నిర్వహించిన ఆటా వేడుకల్లో భాగంగా ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వి.బి.ఆర్. పాఠశాల విద్యార్థులతో ప్రవాసాంధ్రులు కాసేపు ముఖా ముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి చదువుతున్న నిషాంత్ 'ఇప్పటి దాకా భారతీయులు ఉద్యోగాల కోసం విదేశీ రాయబార కార్యాలయాల ముందు బారులు తీరడం చూశాం. మరి విదేశీయులు మన రాయబార కార్యాలయాల ముందు క్యూలు కట్టే రోజు ఎప్పుడు చూస్తాం?' అని అడిగిన ప్రశ్నకు ప్రవాసాంధ్రుల నుంచి మంచి స్పందన లభించింది. ఆటా కాబోయే అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఈ వేడుకల సంధానకర్త రవిరెడ్డి సన్నారెడ్డిలు సమాధానమిస్తూ భారతీయులు అపార మేధాసంపన్నులుగా తయారవుతున్నారని, మనదేశమూ అతివేగంగా అభివృద్ధిపథాన పయనిస్తూ స్వయం సమృద్ధమవుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో మన రాయబార కార్యాలయాల ముందు విదేశీ యులు బారులు తీరే రోజు అతి త్వరలోనే చూడబోతున్నామని పేర్కొన్నారు. ఒకప్పుడు భారతీయ

విద్యార్థి వస్తుంటే అమెరికన్ విద్యార్థి తాను తింటున్న బ్రెడ్‌ను దాచుకునేవాడు. ప్రస్తుతం తనకున్న విజ్ఞానాన్ని, ఉద్యోగావకాశాలను దాచుకునే పరిస్థితిని సృష్టించామని, ఉపాధివేటను వీడి అవకాశాలను కల్పించే స్థాయికి భారతీయులు ఎదుగుతున్నారన్నారు.

*తెలుగుబిడ్డలెందరో అంబానీలు కానున్నారు*

సోనిక అనే చిన్నారి 'ఇటీవల సెన్సెక్స్ 20వేల పాయింట్లు దాటిన సందర్భంలో అంబానీలు అపర కుబేరుల జాబితాలో స్థానం సంపాదించారు. మరి ప్రవాసాంధ్రులు అలాంటి స్థానానికి ఎప్పుడు చేరుకుంటారని' అడిగింది. ఎందరో తెలుగుబిడ్డలు అంబానీల స్థానానికి చేరేరోజు త్వరలోనే వస్తుందని, ఇప్పటికే అమెరికా అధ్యక్షుని ద్వారా ఎందరో ఆంధ్రులు ఉన్నతస్థానాల్లో నియమితులై తమ సత్తా చాటుతున్నారని వారు బదులిచ్చారు. స్వశక్తితో మరెందరో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు.


బదులిస్తున్న ప్రవాసాంధ్రులు

*సామర్థ్యాన్ని బట్టే అవకాశాలు*

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగావకాశాలపై ఓ చిన్నారి అడిగిన ప్రశ్నకు అవి దేశాలను బట్టి కాదని, వ్యక్తిగత సామర్థ్యాలను బట్టి మాత్రమే ఆధారపడి ఉంటాయని ప్రవాసాంధ్రులు సమాధానమిచ్చారు.

*మన విద్యే మిన్న*

అమెరికాలో విద్యావ్యవస్థ తీరుతెన్నులపై ప్రవీణ్ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు అమెరికా విద్యావిధానం కన్నా మన విద్యావిధానమే మెరుగైందని ప్రవాసాంధ్రుడు హరనాథ్‌రెడ్డి తెలిపారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు ప్రాథమిక స్థాయి నుంచి మనం అత్యంత ప్రాధాన్యమిస్తామని, కానీ అక్కడ వీటికిచ్చే ప్రాముఖ్యత చాలా తక్కువన్నారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అమెరికా వారు అధిక ప్రాధాన్యమిస్తారన్నారు. తల్లిదండ్రుల మార్గనిర్దేశనం ఉండదని, పిల్లలే వారికిష్టమైన వాటిని ఎంచుకుని ప్రావీణ్యం సంపాదించే ప్రయత్నం చేస్తారని చెప్పారు. దీంతో భవిష్యత్తులో అక్కడ మేధావుల కొరత ఏర్పడనుందని పేర్కొన్నారు.

*ఒకరికొకరు..*

అమెరికాలో జీవన విధానంపై పద్మిని అనే విద్యార్థిని ప్రశ్నకు ఇక్కడ జీవనశైలికి, అక్కడి దానికి పెద్దగా తేడా ఉండదని, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే వారు అన్ని పనుల్లోనూ పూర్తిగా సహకరించుకుంటారని ప్రవాసాంధ్రులు బదులిచ్చారు. పిల్లల బాధ్యతల దగ్గరనుంచి అంట్లుతోమడం దాకా అన్నింటా ఈ సహాయసహకారాలు కొనసాగుతాయన్నారు.

భరత్‌రాజ్ అనే చిన్నారి ప్రాథమిక విద్యావిధానంలో లాప్‌టాప్‌లు ఏవిధంగా ఉపయోగపడతాయని అడగ్గా వాటి ద్వారా సమస్త సమాచారాన్నిఅందిపుచ్చుకునే వెసులుబాటు కలుగుతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇది తప్పనిసరని రవీందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అడిగిన ప్రశ్నలకు ప్రవాసాంధ్రులు ఉల్లాసభరితంగా సమాధానాలిచ్చారు. సినీ నిర్మాత, కథానాయకుడు పి.హరనాధ్ వేమన పద్యాలను ఉటంకిస్తూ ఇచ్చిన సమాధానం ఆహుతులను ఆకట్టుకుంది.

**Courtesy Eenadu.**